క్లుప్తంగా

శివాజీకి నివాళులు



పెదపెంకిలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సంజీవినాయుడు

బలిజిపేట: మరాఠా యోధుడు చత్రపతి శివాజీ వర్ధంతి సందర్భంగా మండలంలోని పెద పెంకి గ్రామంలో గల నేతాజీ గ్రంథాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ సాధించిన గొప్ప విజయాలను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కె.మధు, ఎ.దయానంద్, కె.బాబూరావు, ఇ.మధు తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత పండగ నిర్వహణ కమిటీ ఏర్పాటు



సమావేశం నిర్వహిస్తున్న గ్రామస్తులు

పార్వతీపురం టౌన్: స్థానిక మున్సిపాల్టీలోని జగన్నాథపురం ఎర్రకంచమ్మ గ్రామదేవత పండగ నిర్వహణకు సోమవారం స్థానికులు సమావేశాన్ని నిర్వహించి పండగ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. మే నెల 29,30,31తేదీల్లో నిర్వహించనున్న ప్రధాన పండగతోపాటు ముందుగా ఈనెల 10వతేదీన నాంది పూజలు చేసి అమ్మవారిని గ్రామంలోకి తీసుకురావడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కౌన్సిలర్ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిపై చర్యలు తీసుకోవాలి

సాలూరు: వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాలకు సంబంధించి సుప్రీంకోర్టులో స్టేటస్ కో అమలులో ఉన్నప్పటికీ.. ఇవి ఒడిశా రాష్ట్రానికి చెందిన గ్రామాలని.. ఆంధ్రా గో బ్యాక్ అని నినాదాలు చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఈ వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం కోర్టులో రిట్ వేయాలని కోరారు. బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన కేంద్రమంత్రిపై చర్యలు తీసుకోవాలన్నారు.

పవిత్రంగా చక్రతీర్థ స్నానాలు



నదీతీరంలో పూజలు చేస్తున్న భక్తులు

భామిని: బాలేరు కోదండరామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా భక్తులు ఉత్సవమూర్తులను సోమవారం వంశధార నదికి తీసుకువెళ్లి చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. నదీతీరంలో శ్రీరామ, లక్ష్మణ, సీతమాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీరామ నామసంకీర్తనతో వంశధార తీరం మార్మోగింది.

నవధాన్యాల సాగుతో భూసారం మెరుగు

గరుగుబిల్లి: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని సబ్‌డివిజనల్ యాంకర్ పర్సన్ జి.అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని నాగూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు నవధాన్యాల సాగుపై సోమవారం అవగాహన కల్పించారు. నవధాన్యాల పంటను పొలంలో కలియదున్నడం వల్ల అందులోని నత్రజని, కర్బనం, ఇతర పోషకాలు నేలను చేరుతాయన్నారు. ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. ఖరీఫ్‌లో రైతులంతా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ జ్యోత్స్న, వి.పోలినాయుడు, బి.శ్రీను తదితరులున్నారు.

పొట్టేళ్ల వేలం

పాలకొండ రూరల్: ఇటీవల మండల పరిధిలో నిర్వహించిన పొట్టేళ్ల పందేలపై పోలీసులు దాడిచేసి పట్టుకున్న రెండు పొట్టేళ్లను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు వాటిని వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు మధ్యాహ్నం 2 గంటలకు జరిగే వేలంలో పాల్గొనవచ్చన్నారు.

నీటితీరువా వసూలు చేయండి

వీరఘట్టం: మండల వ్యాప్తంగా పేరుకుపోయిన నీటితీరువా బకాయి వసూళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వారానికి రూ.50 వేలు చొప్పున వసూలు లక్ష్యాలను నిర్దేశించారు.

పంట నష్టం పరిశీలన

సీతానగరం:





నేలమట్టమైన మొక్కజొన్న పంట (ఇన్‌సెట్లో) కొత్తవలసలో విరిగిన గెలలతో అరటిపంట

ఇటీవల ఈదురుగాలులతో కురిసిన వర్షాలతో మండలంలోని పంటలకు వాటిల్లిన నష్టాన్ని పరిశీలించిన అంచనా వేయడంతో పాటు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కొత్తవలస, లక్ష్మీపురం, గెడ్డలుప్పి గ్రామాల్లో పంటనష్టాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటివనరులున్న గ్రామాల్లో రైతులు 470 ఎకరాల్లో మొక్కజొన్నపట సాగు చేస్తున్నారని తెలియజేశారు. అందులో 5.56 ఎకరాల్లో పాలుపోసు కుంటున్న సమయంలోనే మొక్కజొన్న పంట నేలమట్టం కావడంతో నష్టం వాటిల్లిందని తెలియజేశారు. అలాగే 138 ఎకరాల విస్తీర్ణంలో రైతులు అరటి పంట సాగు చేస్తుండగా 10 ఎకరాల్లో పంటనష్టం వాటిలిందని గుర్తించినట్లు చెప్పారు. పంటనష్ట పరిహారం (బీమా పథకం ద్వారా) నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. ఆయనతో పాటు గెడ్డలుప్పి, కొత్తవలస గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పరిశీలనలో ఉన్నారు.

6 నుంచి పూర్తిస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం



బాలగుడబలో ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి శ్రీకాంత్

పార్వతీపురం టౌన్: ఏప్రిల్ 6వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులోకి వస్తుందని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బాలగుడబ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్‌రన్ ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని, పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులను నిర్వహిస్తున్నామని, ప్రజలంతా ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

రాజన్నదొర హయాంలోనే అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర హయాంలోనే గిరిశిఖర గ్రామాలు అభివృద్ధి చెందాయని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మువ్వల ఆదయ్య, దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, తదితరులు స్పష్టం చేశారు. మండలంలోని మామిడిపల్లిలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, పత్రికలు ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సి ఉండగా.. కొన్ని పత్రికలు దానికి భిన్నంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఇటీవలో ఓ పత్రికలో (సాక్షి కాదు) డోలీలపై వచ్చిన కథనం వాస్తవం కాదన్నారు. ఎవరి హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చెందిందో బహిరంగ చర్చకు రావాలని టీడీపీ నాయకులకు సవాల్ విసిరినా స్పందించకుండా.. తమకు అనుకూలమైన పత్రికల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో గిరిశిఖర గ్రామాలకు ఎందుకు రోడ్లు వేయలేదని ప్రశ్నించారు. కందులపథం వంతెనకు కొబ్బరికాయలు కొట్టి గాలికొదిలేసిన టీడీపీ నాయకుల ప్రచార ఆర్భాటాలను ప్రజలెవ్వరూ మరిచిపోలేదని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా ఉన్న గుమ్మడి సంధ్యారాణి గిరిజన గ్రామాల అభివృద్ధికి చేసిన కృషి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి రాజన్నదొర అటవీ శాఖాధికారులతో మాట్లాడి గిరిశిఖర గ్రామాలకు రోడ్లు వేశారని కొనియాడారు. సమావేశంలో రఘుపాత్రుని సాంబమూర్తి, పెద్దింటి మాధవ, తదితరులు ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని లక్ష్మీపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతుల ఆర్థికాభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. స్థానికంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తే ప్రభుత్వం దృష్టికి తాను తీసుకువెళ్తానన్నారు. రైతులకు జీవనాధారమైన చెరకు పంట క్రషింగ్ చేయాల్సిన కర్మాగారం మూతపడడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలియజేశారని చెప్పారు. చెరకు తరలింపులో రైతులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అలాగే గ్రామంలో బీటీ రోడ్డును ఆనుకుని ఉన్న మురుగు నీరును పరిశీలించారు. కార్యక్రమంలో లక్ష్మీపురం ఎంపీటీసీ జి పార్వతి, స్థానిక వైసీపీ కార్యకర్తలు పువ్వలరాము, అప్పారావు, సీహెచ్ ఉమామహేశ్వరరావు, గవర చిన్నంనాయుడు,, ఇ.గంగునాయుడు, నిడగల్లు మాజీ సర్పంచ్ జి వెంకటనాయుడు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా'

మక్కువ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైఎస్సార్ ఆసరా సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు వెలుగు ఏపీఎం సన్నిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం, గిరిజనశాఖ మంత్రి పీడిక రాజన్నదొర, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరుకానున్నట్లు తెలిపారు. మండలస్థాయి అధికారులు, మహిళలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

విద్యుత్ లైన్ల పునరుద్ధరణ



జానుమల్లువలస వద్ద విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్న అధికారులు

సీతానగరం: ఇటీవల వీచిన ఈదురుగాలులకు మండలంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తగా స్తంభాలను ఆ శాఖ అధికారులు ఆగమేఘాల మీద వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. శనివారం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగి నేలకూలడంతో గాదెలవలస, జానుమల్లువలస, పూనుబుచ్చింపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు ఏఈ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలను ఆదివారం పునరుద్ధరించి సోమవారం ఆయాగ్రామాలకు విద్యుత్ సరఫరా అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మండలంలోని అప్పయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న సీతానగరం, పెదభోగిలి గ్రామాల్లో విద్యుత్‌లైన్ల పెట్రోలింగ్ చేయడం కారణంగా విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులకు మండలంలోని పొలాల్లో అరటి చెట్లు, తోటల్లో కొమ్మలు విద్యుత్ తీగలపై పడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ఇబ్బందులు వచ్చాయని తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం సీతానగరంలో పెట్రోలింగ్ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పనులు జరగనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్' విజయవంతం చేయాలి



పార్వతీపురం టౌన్: ప్రచార కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

బలిజిపేట: ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ కోరారు. ఈ మేరకు ప్రచార సామగ్రిని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో బర్లి, సుభద్ర, అరసాడ, అజ్జాడలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుంచి గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్ధారించిన ప్రకారం గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు నిర్వహించాలని కోరారు. ప్రతిరోజూ క్లస్టర్ పరిధిలో 15గృహాలను సందర్శించి వారికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వారితో పాటు మమేకమై వారు పార్టీకి ఓటువేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం ఇది అని పూర్తిస్థాయిలో తెలియపరచాలని చెప్పారు. ఈ కార్యక్రమం ముగింపు 14వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, జగస్, టి.ప్రసాద్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల వారీగా ప్రచార కిట్ల పంపిణీ



బర్లిలో కన్వీనర్లకు పంపిణీ చేసిన సామగ్రి

పార్వతీపురం టౌన్: ఈనెల 7వ తేదీ నుంచి 14 వరకు చేపట్టనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సోమవారం మండల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్ ఆధ్వర్యంలో ప్రచార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని అడ్డాపుశీల, బాలగుడబ, నర్సిపురం గ్రామ సచివాలయాల పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం పండగలా జరపాలని, ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాన్ని గుర్తుచేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మజ్జి శేఖర్, బలగ నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ బి.వాసు, వెంపల గుర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరతి పరీక్షలు ప్రారంభం



సాలూరు: బొడ్డవలస పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

సాలూరు: పదో తరగతి పరీక్షలు పట్టణం, మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 8 కేంద్రాల్లో పరీక్షలు జరిగగా.. విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకున్నారు. హాల్ టికెట్ల నంబర్లు సరిచూసుకుని, వారికి కేటాయించిన గదుల్లో పరీక్ష రాశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

శతశాతం హాజరు..



మక్కువ: హాల్ టిక్కెట్లు సరి చూసుకుంటున్న విద్యార్థులు

మక్కువ: పదో తరగతి మొదటి రోజు పరీక్షకు విద్యార్థులందరూ హాజరైనట్లు ఎంఈఓ వి.మల్లేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 217 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. అందరూ హాజరయ్యారు. అలాగే ములక్కాయవలస మోడల్ పాఠశాలలో 196 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారు.



బలిజిపేట: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సీతానగరం: పదో తరగతి పరీక్షా కేంద్రం

ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వీరఘట్టం: స్థానిక బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, హిందీ పరీక్షలకు 217 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 20 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ దూసి నాగమణి తెలిపారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వాహనాల వేలం

కురుపాం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ పరిధిలో గతంలో మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎస్సై బీవీ నాగభూషణరావు ఒక ప్రకటన తెలిపారు. ఒక బొలేరో, ఐదు ద్విచక్ర వాహనాలు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 11 గంటలకు ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

రేపు పాలకొండలో..

పాలకొండ రూరల్: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుకున్న వాహనాలను ఈనెల 5న స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వేలం వేయనున్నట్లు ఎస్సై బి.శివప్రసాద్ సోమవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహన యజమానులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. వారి నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో వాటిని వేలం వేస్తున్నట్లు చెప్పారు. వేలంలో రెండు ఆటోలు, ఒక కారు, ఒక పల్సర్ బైక్ ఉన్నాయన్నారు.

స్పందన వినతులకు సత్వర పరిష్కారం

- సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న పీఓ నవ్య

పాలకొండ: స్పందనలో అందించిన వినతులను సత్వరం పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. వారం రోజుల్లోగా సమస్య పరిష్కరించి ఫిర్యాదుదారునికి తెలియజేస్తామన్నారు.

గిరిజన స్పందనకు 17 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ప్రాజెక్టుఅధికారి బి.నవ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 17 వినతులు వచ్చాయి. మాలువ గ్రామానికి చెక్‌డ్యాం, సవరతిడ్డిమికి కల్వర్టు మంజూరు చేయాలని, బొడ్డగూడ, భరణికోట గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్తులు కోరారు. ఆశావర్కర్ పోస్టు మంజూరు చేయాలని గొట్టిలక్ష్మీపురానికి చెందిన స్వాతి, జీడిపంట నష్టపరిహారం ఇప్పించాలని జి.గుమ్మడకు చెందిన అమ్మన్న, కుట్టుమిషన్ మంజూరు చేయాలని బూర్జగూడకు చెందిన మార్త దరఖాస్తు చేసుకున్నారు. వన్‌బీ పత్రం ఇప్పించాలని గూనభద్రకు చెందిన లక్ష్మి, తాగునీటి సమస్య పరిష్కరించాలని కడంబసింగికి చెందిన జాన్ కోరారు. స్పందనలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఈఈ జి.మురళి, ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ ఎం.యుగంధర్, ఏఎంఓ కోటిబాబు, పీఏఓ హరికృష్ణ, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, ఏపీడీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'..
సమస్యలు పరిష్కరించుకుందాం



రామభద్రపురం: అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రమామణి

తెర్లాం: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం కానున్నాయని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇకపై సమస్యల పరిష్కారానికి ఎవ్వరూ జిల్లా కేంద్రంలోని స్పందన కార్యక్రమానికి వెళ్లనవసరం లేదన్నారు. ప్రతీ సోమవారం మండల కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమంలోనే వినతి పత్రాలు సమర్పించి, సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోనే అన్ని శాఖల అధికారులతో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రజలకు ఏ సమస్య ఉన్నా అర్జీ రూపంలో సమర్పిస్తే నిర్ణీత గడువులోగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వినతుల ద్వారా ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించి, వారిలో సంతోషం చూడాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమామణి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి స్పందన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా పాల్గొని, ప్రజలు సమర్పించిన వినతులు స్వీకరించి, పరిశీలించారు. అనంతరం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అధికారులు కూడా ప్రజల సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు.

మెంటాడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ త్రివిక్రమ్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి స్పందన కార్యక్రమంలో ఏ ఒక్కరూ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు సమర్పించకపోవడం విశేషం. అయితే సాయంత్రం నాటికి రాబంద గ్రామానికి చెందిన యువత గ్రామంలో రచ్చబండ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం సమర్పించారు.